గరిష్టం/కనిష్టం
39.5 / 23.6

**వాతావరణం**
ఉదయం, మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



**వనపర్తి రూరల్:** పెబ్బేరు మండలానికి చెందిన పి.సుప్రియ, డి.లోకేష్, హరి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌బాల్ కోచ్ ఉమాశంకర్ ఆదివారం తెలిపారు. నల్లగొండ జిల్లా మంగలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం


**వీపనగండ్ల:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అధికారి నర్సింహ, కొల్లాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన యువజన కాంగ్రెస్ నాయకుల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా కల్వరాలకు చెందిన భరత్‌చారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. పదవులు పొందిన వారు పార్టీ బాగోగులతో పాటు సంక్షేమ పథకాల అమలులో కూడా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకులు దివాకర్, నరేష్, రంగవరం రాజశేఖర్, కావలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# గట్టెక్కించారు..

## అధికారుల ముందుచూపుతో వేసవిలో సాగు, తాగునీటి ఎద్దడి నివారణ

- జూరాల ఆయకట్టుకు పక్కాగా వారబందీ అమలు
- ఎగువ నుంచి నీటి సరఫరాతో తీరిన ఇక్కట్లు



ప్రియదర్శిని జూరాల జలాశయం

**అమరచింత:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, మిషన్ భగీరథ అధికారుల ముందు చూపు, పక్కా ప్రణాళికతో వేసవిలో సాగు, తాగునీటి కష్టాలు ఎదురుకాలేదు. వారబందీ విధానంలో నిర్దేశించిన ఆయకట్టు సాగునీటిని అందించడంతో రైతులు తమ పంటలను కాపాడుకొని ధాన్యాన్ని విక్రయించుకున్నారు. గ్రామాలు, పట్టణాలకు నిత్యం తాగునీటిని సరఫరా చేయడంతో జిల్లాలో అక్కడక్కడ మినహా తాగునీటి కోసం జనం రోడ్డెక్కలేదని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 255 గ్రామాలకు జూరాల, కేఎల్ఐ ద్వారా తాగునీటి పథకాలకు నీటిని తరలించడంతో వేసవిలో ఇబ్బందులను అధిగమించినట్లు తెలిపారు.

**వారబందీ విధానంలో..**

జలాశయంలో నీటిమట్టం తక్కువగా ఉండటంతో యాసంగిలో జూరాల ఆయకట్టును కుదించారు. ఎడమకాల్వ విభాగంలో 85 వేల ఎకరాలకుగాను కేవలం 20 వేల ఎకరాలు, కుడికాల్వ పరిధిలో 15 వేల ఎకరాలకు మాత్రమే సాగునీటిని అందిస్తామని.. ఎడమకాల్వ పరిధిలోని అమరచింత, ఆత్మకూర్, రామన్‌పాడు రిజర్వాయర్ వరకు మాత్రమే రైతులు పంటలు సాగు చేయాలని పీజేపీ అధికారులు ముందస్తుగానే ప్రకటించారు. మిగిలిన ఆయకట్టు మండలాల్లోని రైతులు పంటలు సాగు చేయొద్దని.. వేసినా నీరందక ఎండిపోవడం ఖాయమని రైతులకు అవగాహన కల్పించడమేగాకుండా ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో టాంటాం వేయించారు.

**ప్రభుత్వ చర్చలు సఫలం..**

జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుతుందని, ఇక్కడి ప్రజలకు తాగు, సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకతో చర్చలు జరిపింది. దీంతో నారాయణపూర్ డ్యాం నుంచి 4 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో కష్టకాలంలో గట్టెక్కినట్లయింది.

### తాగునీటి సరఫరా ఇలా..

ఏప్రిల్‌లో జూరాల జలాశయంలో 2.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉన్న నీటిని వినియోగించి పూర్తిస్థాయిలో అందించేలా మిషన్ భగీరథ అధికారులు తగిన ప్రణాళికతో ముందుకు సాగారు. జూరాల ప్రాజెక్టు నందిమళ్ల క్యాంపు వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి పథకం నుంచి నిత్యం 2 ఎంఎల్‌డీల నీటిని నారాయణపేట జిల్లాలోని 3 గ్రామాలు, వనపర్తి జిల్లాలోని 9 గ్రామాలకు అందిస్తూ వచ్చారు. రామన్‌పాడు తాగునీటి పథకం ద్వారా నిత్యం 24 ఎంఎల్‌డీల నీటిని 12 గ్రామాలు, ఎర్రగట్టు నుంచి 18.45 ఎంఎల్‌డీల నీటిని 34 గ్రామాలకు అందించారు. అదేవిధంగా కానాయపల్లి నుంచి 20 ఎంఎల్‌డీల నీటిని 115 గ్రామాలతో పాటు మహబూబ్‌నగర్‌లోని 3 గ్రామాలకు.. బుగ్గపల్లి తండా ద్వారా 75 ఎంఎల్‌డీల నీటిని 87 గ్రామాలతో పాటు కొత్తకోట, వనపర్తి పురపాలికలకు సరఫరా చేశారు. గోపాల్‌పేట ద్వారా 10 ఎంఎల్‌డీల నీటిని 44 గ్రామాలు, శ్రీరంగపురం నుంచి 5 ఎంఎల్‌డీల నీటిని 10 గ్రామాలతో పాటు పెబ్బేరు పురపాలికకు అందించారు. గోపల్‌దిన్నె ద్వారా 5 ఎంఎల్‌డీల నీటిని 19 గ్రామాలు, గౌరిదేవిపల్లి ద్వారా 7.7 ఎంఎల్‌డీల నీటిని రేవల్లి మండలంలోని 8 గ్రామాలు, ఎల్లూరు ద్వారా 13 ఎంఎల్‌డీల నీటిని వీపనగండ్ల, ఏదుల మండలాలకు సరఫరా చేశారు.

### పంట ఎండిపోతుంది అనుకున్నా..



**యాసంగిలో మూలమళ్ల శివారులో 5 ఎకరాల్లో వరి సాగుచేశా.** చివరి రెండు తడులు నీరు అందకపోతే పంట ఎండిపోతుంది అనుకొని ఆశలు వదులుకున్నా. ఎమ్మెల్యే చొరవతో నీటిని వదలడంతో పంట చేతికొచ్చింది. ఎకరాకు 25 కింటాళ్ల దిగుబడి రావడం సంతోషంగా ఉంది.

– మోహన్‌రెడ్డి, సింగంపేట

### ఉన్నతాధికారుల సూచనలతో..



ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉండటంతో యాసంగిలో ఆయకట్టులో సాగు విస్తీర్ణం తగ్గించాం. దీంతో పాటు వారబందీ విధానాన్ని పక్కాగా అమలుచేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చివరి తడులుగా రెండు పర్యాయాలు నీటిని అందించాం. ఆయకట్టులో పంటలు ఎండకుండా తగిన చర్యలు తీసుకొని సమస్యను అధిగమించగలిగాం.

– జగన్మోహన్‌రెడ్డి, ఈఈ పీజేపీ నందిమళ్ల డివిజన్

### ఎప్పటికప్పుడు మరమ్మతులు..



వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. తాగునీటి పథకాల మోటార్ల మరమ్మతుతో పాటు పైపులైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేశాం. చిన్న చిన్న మరమ్మతులు, సిబ్బంది అలసత్వం కారణంగా అక్కడక్కడ తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగిందే తప్ప తాగునీటి కష్టాలు కలిగించలేదు.

– మేఘారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ, వనపర్తి

# నేడు నల్లమలకు సీఎం రేవంత్



అమ్రాబాద్ మండలం మాచారంలో సిద్ధమైన సభా ప్రాంగణం

- అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిరా సౌర జలవికాసం పథకం ప్రారంభం
- అనంతరం భారీ బహిరంగ సభ
- స్వగ్రామం కొండారెడ్డిపల్లెలోనూ పర్యటన
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి



**సాక్షి, నాగర్‌కర్నూల్:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిరా సౌర జల వికాసం పథకానికి అంకురార్పణ చేయనున్నారు. మాచారం గ్రామంలోని చెంచుల పోడు భూముల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన సోలార్ పంప్‌సెట్ మోటారు ఆన్ చేసి సీఎం పథకాన్ని ప్రారంభిస్తారు. అక్కడే ఇందిరా సౌర జల వికాసం ప్రాజెక్ట్ పైలాన్‌ను సీఎం ఆవిష్కరిస్తారు. అనంతరం మాచారం గ్రామంలో నిర్వహించే భారీ బహిరంగసభలో పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ సంతోష్ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పైలట్ ప్రాజెక్ట్ కింద 27 మంది లబ్ధిదారులు..**

ఇందిర సౌర జల వికాసం కింద అమ్రాబాద్ మండలం మాచారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగా, ఇప్పటికే 27 మంది చెంచు రైతులకు చెందిన మొత్తం 50 ఎకరాల పోడు భూములను అధికారులు సిద్ధం చేశారు. రైతుల పోడు భూములను చదును చేయడంతో పాటు భూగర్భ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో 16 బోర్లను తవ్వించారు. వాటికి సోలార్ విద్యుత్, 5 హెచ్‌పీ మోటారును ఏర్పాటు చేశారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతుల భూముల్లో ఇప్పటికే నిమ్మ, బత్తాయి, అవకాడో, మామిడి మొక్కలతో పాటు సరిహద్దుల్లో కొబ్బరి, వెదురు మొక్కలను నాటించారు. వాటికి నీటి సరఫరా కోసం స్ప్రింక్లర్లు, డ్రిప్ వ్యవస్థలను ఏర్పాటుచేశారు. మొక్కల ద్వారా శాశ్వత ఆదాయం వచ్చేంత వరకు ప్రత్యామ్నాయంగా అంతర్గత పంటలను వేసేలా చెంచు రైతులకు అవగాహన కల్పించారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో మేలు జరిగేలా చూసేందుకు ఐదేళ్ల పాటు అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు.

### సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

- సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు అమ్రాబాద్ మండలం మాచారంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- ఉదయం 11.10 గంటలకు గ్రామంలోని చెంచుల పోడుభూముల్లో సోలార్ విద్యుత్‌తో నడిచే బోరు మోటారును ఆన్‌చేసి ఇందిరా సౌర జలవికాసం పథకాన్ని ప్రారంభిస్తారు. అక్కడే ఈ పథకానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకిస్తారు.
- 11.35 గంటలకు గ్రామంలోని సీతా రామాంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- 11.45 గంటలకు గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు రోడ్డు మార్గంలో వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి బయలుదేరుతారు.
- 3 గంటలకు కొండారెడ్డిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు.
- అనంతరం హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

### సీఎం సొంత గ్రామంలోనూ పర్యటన..

మాచారంలో ఇందిరా సౌర జల వికాసం పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో పర్యటించనున్నారు. వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుకోనున్నారు. గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఖర్చుతో ఇటీవల నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు.

## క్లుప్తంగా

### టిప్పర్ ఢీకొని ఒకరి దుర్మరణం


నారాయణ (ఫైల్)

మరికల్: టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాము కథనం మేరకు.. ధన్వాడ మండలం కంసాన్‌పల్లికి చెందిన కొల్లంపల్లి ఉప్పరి నారాయణ (48) పెద్దచింతకుంట నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మరికల్ చౌరస్తాలో బైక్‌ను మలుపుతుండగా ఒడిస్సా నుంచి రాయచూర్ వైపు వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి బైక్‌ను ఢీకొని ఆయన తలపై నుంచి టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నారాయణ రియల్ వ్యాపారం చేస్తుండటంతో ఆయన బైక్‌లో విలువైన డాక్యుమెంట్లు, రూ.లక్ష నగదు ఉండటంతో పోలీసులు వాటిని బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

### బైక్ అదుపుతప్పి మరొకరు మృతి


రమేశ్ (ఫైల్)

వెల్దండ: మండలంలోని బైరాపూర్ సమీపంలో వెల్దండ–చారకొండ రహదారిపై బైక్ అదుపుతప్పి భూత్కురి రమేశ్ (30) మృతి చెందినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొట్ర గ్రామానికి చెందిన రమేశ్ బంధువుల ఇంటికి వెళ్లొస్తానని చెప్పి శనివారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోగా ఫోన్ చేసినా ఎత్తలేదు. ఆదివారం రోడ్డు పక్కన గుంతలో బైక్, వ్యక్తిని గుర్తించిన బైరాపూర్ గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్‌ఐ వివరాలు సేకరించగా కొట్ర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ వివరించారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### చికిత్స పొందుతూ ఏఎస్‌ఐ మృతి

మానవపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఎస్‌ఐ సమద్ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఏఎస్‌ఐ సమద్ జిల్లా పోలీసు కార్యాలయంలోని కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వర్తించేవాడు. గత నెల 27న విధులు ముగించుకొని తిరిగి వస్తూ మానవపాడు స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతదేహానికి అలంపూర్ ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమద్‌కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్పీ ఆదేశానుసారం సమద్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అంత్యక్రియల కుగాను రూ.20 వేలు అందించినట్లు ఏఎస్‌ఐ వివరించారు.

### చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని నాగనూలులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. మండలంలోని ఔరాసిపల్లికి చెందిన ప్రభాకర్ (39) హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసుకొని జీవనం సాగించేవాడు. ఈ నెల 13న స్వగ్రామానికి వచ్చిన అతడు తిరిగి వెళ్లలేదు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో నాగనూలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య బలన్మరణం


పార్వతమ్మ మృతదేహం

వంగూర్: భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వంగూర్ మండలం నర్సంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ వివరాల మేరకు.. నర్సంపల్లికి చెందిన పార్వతమ్మ (45) భర్త వెంకటయ్య అనారోగ్యంతో 20 రోజుల క్రితం మృతిచెందాడు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. కొంత సేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# పోడు భూములకు మహర్దశ


మాచారంలో చెంచుల పోడు భూముల్లో ఏర్పాటు చేసిన సోలార్ పంప్‌సెట్

- 'ఇందిరా సౌరగిరి జలవికాసం'తో సౌర విద్యుత్‌తో పాటు సాగునీటి వసతి
- గిరిజన, చెంచు రైతుల సుస్థిర సాగుకు పక్కా ప్రణాళిక

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా శ్రీకారం చుట్టనున్న ఇందిరా సౌరగిరి జల వికాసం పథకంతో పోడు భూములకు మహర్దశ పట్టనుంది. గిరిజన, చెంచు రైతులు ఉద్యాన పంటలు పండించి ఆదాయం పొందేలా తీర్చిదిద్దనున్నారు. ఇందుకు సంబంధించిన నిధుల కేటాయింపు, మార్గదర్శకాలను గిరిజన సంక్షేమశాఖ విడుదల చేసింది. వందశాతం రాయితీతో ఒక్కో యూనిట్‌కు రూ. 6లక్షల చొప్పున ఖర్చు చేస్తారు. పోడు భూముల్లో సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు రానున్న ఐదేళ్ల పాటు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగునీటి వసతి కల్పిస్తారు. మొదటి మూడేళ్లు అంతర పంటలు సాగుచేస్తూ.. ఆదాయం పొందే విధంగా రైతులను ప్రోత్సహిస్తారు. ఆ తర్వాత పండ్ల తోటల నుంచి దిగుబడులు వచ్చి రైతులకు ఆదాయం సమకూరనుంది. ఈ పథకం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో 27 మందికి చెందిన 50 ఎకరాల భూముల్లో సౌర విద్యుత్‌తో పాటు ఉచితంగా బోరుడ్రిల్లింగ్, 5హెచ్‌పీ మోటార్లు, స్ప్రింకర్లు, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇద్దరు రైతులకు ఒకటి చొప్పున 16 బోర్లు వేయించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 21 మండలాల పరిధిలోని 114 గ్రామాల్లో 3,410 మంది చెంచు, గిరిజనులకు 7,765.12 ఎకరాల పోడు భూములకు అటవీ హక్కుల చట్టం కింద భూములపై హక్కు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. వీరందరికీ లబ్ధి చేకూరనుంది.

#### క్షేత్రస్థాయి పర్యటన..

ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం కింద చేపట్టే డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, దానిమ్మ, వెదురు, కొబ్బరి ఇతర తోటలను పరిశీలించడానికి మాచారం గ్రామ చెంచు రైతులను దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లెపల్లి ఉద్యానవన పరిశోధన కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ పండ్ల తోటలు, మొక్కల పెంపకం, వాటికి ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోడు భూములను చదును చేసి పండ్ల తోటలు పెంచేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

ఉమ్మడి జిల్లాలో పోడు భూముల వివరాలిలా..

| నియోజకవర్గం | గ్రామాలు | రైతులు | పోడు భూములు |
|---|---|---|---|
| అచ్చంపేట | 58 | 1,827 | 4,612.4 |
| కొల్లాపూర్ | 24 | 1,083 | 2.531.1 |
| కల్వకుర్తి | 3 | 8 | 24.5 |
| మహబూబ్‌నగర్ | 12 | 77 | 116.12 |
| వనపర్తి | 17 | 415 | 481 |

# ఆదివాసీ చెంచులకు వరం


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.. చిత్రంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

అచ్చంపేట/మన్ననూర్: ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం ఆదివాసీ చెంచులకు వరంలాంటిదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాండ్ వైభవ్ రఘునాథ్‌లతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నిరాధారణకు గురైన ఆదివాసీ చెంచులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. పోడు భూముల్లో ఎకరాకు రూ. 6లక్షల నుంచి రూ. 8లక్షల వరకు ఖర్చుచేసి ఉద్యాన తోటలను అభివృద్ధి చేసి ఇస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2లక్షల మంది ఆదివాసీ రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. గిరిజన రైతుల కోసం ప్రవేశపెడుతున్న కొత్త పథకాన్ని నల్లమల ప్రాంతంలో ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ చెంచుల అభ్యున్నతి కోసం బృహత్తర పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. సీఎం సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి అధికారి, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీపీఓ రామ్మోహన్, డీటీడీఓ ఫిరంగి, ఆర్డీఓ మాధవి, జిల్లా ఉద్యానశాఖ అధికారులు జగన్, వెంకటేశ్, రాజేందర్, మల్లేష్, వెంకటయ్య తాహసీల్దార్ శైలేంద్ర, ఎంపీడీఓలు వెంకటయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

#### 1,350 మంది పోలీసులతో బందోబస్తు

సీఎం రేవంత్‌రెడ్డి నల్లమల పర్యటన సందర్భంగా 1,350 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇద్దరు ఎస్పీలు, ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 8మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 50 మంది ఎస్‌ఐలు, 1,267 ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు. మాచారం గ్రామంలో పోలీసు సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. వెంకటేశ్వర్లబావి రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన పార్కింగ్ స్థలం నుంచి మాచారం, అమ్రాబాద్, పదర రోడ్డు, హెలిప్యాడ్, సభా వేదిక, సీఎం ప్రారంభించే పైలాన్ వరకు బందోబస్తులో ఉండే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# హైవేపై తప్పిన పెను ప్రమాదం



కారుపై పడిన కంటైనర్‌లోని మిషనరీ

- కారుపై పడిన కంటైనర్‌లోని మిషనరీ
- భారీగా నిలిచిన వాహనాలు


జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఆదివారం ప్రయాణిస్తున్న భారీ కంటైనర్‌లోని మిషనరీ కారుపై పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు, ఎస్‌ఐ వెంకటేశ్ వివరాల మేరకు.. కర్నూలు జిల్లాలోని కోవెలకుంట్లకు చెందిన పుష్పహాసారెడ్డి తన కారులో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై పదో బెటాలియన్ సమీపంలో ముందుగా వెళ్తున్న కారు సడెన్ బ్రేక్ వేయడంతో దానికి స్వల్పంగా వెనకనుండి ఢీకొట్టారు. ఈ క్రమంలో రెండు కార్ల యజమానులు వాహనాలను రోడ్డు పక్కన ఆపి గొడవ పడుతుండగా.. అదే దారి గుండా వెళ్తున్న ఓ భారీ కంటైనర్‌ను నిలువరించేందుకు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బెల్ట్ తెగిపోయి దానిపై ఉన్న మిషనరీ కారుపై పడింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురు వ్యక్తులు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. అయితే హైవేపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

### కనిపించిన చిరుత



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని పింజరిగుట్టపై ఆదివారం సాయంత్రం చిరుత కనిపించింది. మంగళవారం కనిపించిన చిరుత.. తిరిగి ఆదివారం సాయంత్రం కూడా ప్రత్యక్షమవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే చిరుతను బంధించాలని కోరుతున్నారు.

### రామన్‌పాడులో 1,015 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,015 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని.. కుడి, ఎడమ కాల్వలకు 12 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. జూరాల ఎడమ, సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదన్నారు.

### మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గద్వాల మండలం బీరోలు గ్రామ సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వృద్ధుడి (62) మృతదేహం లభ్యమైంది. గ్రామ సమీపంలోని కృష్ణానదిలో వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రెండు, మూడు రోజుల క్రితం కృష్ణానదిలో పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

# కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన చిన్నారి డింపుల్

వనపర్తిటౌన్: కుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ కాలనీలో తోటి చిన్నారులతో కలిసి డింపుల్ అనే చిన్నారి ఆడుకుంటుండగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా దాడికి యత్నించాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమేస్తున్న క్రమంలో ఓ కుక్క డింపుల్‌పై దాడి చేయడంతో ముఖం, చేతిపై గాయాలయ్యాయి. స్థానిక మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ సహకారంతో చిన్నారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ కుక్కకాటుకు సంబంధించిన మందులు అందుబాటులో లేవని వైద్యులు చెప్పడంతో.. స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు చిన్నారి తల్లిదండ్రులు ప్రకాశ్, స్రవంతి తెలిపారు.

పట్టించుకోని మున్సిపాలిటీ..

జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా కుక్కల బెడద ఎక్కువైందని మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ అన్నారు. వీధి కుక్కలను ఎనిమల్ కేర్‌కు తరలించి తగిన చర్యలు చేపడతామని పుర అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని, కుక్కల నివారణకు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థి ప్రాణం తీసిన పిడుగు


ఉదయ్‌కుమార్ (ఫైల్)

దేవరకద్ర రూరల్: ఆ తల్లిదండ్రులకు ఒక్కగానొక కుమారుడు కావడంతో అల్లారుముద్దుగా పెంచుతున్నారు. బాగా చదువుకొని తమకు అండగా నిలుస్తాడని ఆశిస్తున్న తరుణంలో.. పిడుగుపాటు రూపంలో వచ్చిన మృత్యువు వారి ఆశలను కబళించింది. కన్నవారికి తీరని శోకం మిగిల్చిన ఈ ఘటన ఆదివారం దేవరకద్ర మండలం గద్దెగూడెంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గద్దెగూడెం గ్రామానికి చెందిన రైతు బత్తుల కృష్ణయ్య వ్యవసాయం, పాడి ఉత్పత్తితో కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం తనకు పొలం వద్ద పని ఉండటంతో వెళ్లాడు. ఇంటర్ పూర్తిచేసుకుని వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చిన అతడి కుమారుడు ఉదయ్‌కుమార్ (18) పశువులను మేపేందుకు వెళ్లగా.. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఓ చెట్టు కిందకు వెళ్లాడు. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడటంతో ఉదయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఉన్న ఒక్కగానొక కుమారుడి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

### ఇసుక టిప్పర్ల పట్టివేత



గద్వాల క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. వనపర్తి జిల్లా రంగాపురం పరిధిలోని నదీ పరివాహక ప్రాంతం నుంచి ఉండవెల్లి మండలం కల్లుగోట్ల గ్రామానికి చెందిన ఆర్‌వీ శేషుకు చెందిన టిప్పర్ల ద్వారా ఆదివారం ఇసుక గద్వాలకు తరలిస్తున్నారన్నా సమాచారం మేరకు జమ్మిచెడ్ శివారులో దాడి చేసి టిప్పర్లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. అదే విధంగా జమ్మిచెడ్ శివారులోని అక్రమంగా ఆరు టిప్పర్ల ఇసుకను నిల్వ ఉంచినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు టిప్పర్ల యాజమాని ఆర్‌వీ శేషుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# తల్లి మందలించిందని బాలుడి ఆత్మహత్య


మల్లేష్ (ఫైల్)

హన్వాడ: క్షణికావేశం.. కన్నవారి ప్రేమానురాగాన్ని మరిపించింది. జీవితం అంటే ఇంతేనా అనే రీతిలో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకుని తల్లిదండ్రులకు తీరని గర్భశోకాన్ని మిగిల్చాడు. హన్వాడ మండలం టంకరలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా.. టంకరకు చెందిన మెండె పెద్దరాములు – గౌరమ్మలకు ఇద్దరు సంతానం. కుమారుడు మల్లేష్ (13) నారాయణపేటలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి పూర్తిచేసుకొని సెలవుల్లో స్వగ్రామానికి వచ్చాడు. కూతురు స్వగ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి చదువుతుంది. అయితే వేసవి సెలవుల్లో ఇంటి పట్టున ఉంటున్న మల్లేష్ బయటి వ్యక్తులు, ఇతరులతో కలివిడిగా కలిసిపోకపోగా.. ఎవరితోనూ మాట కలపకుండా స్తబ్దుగా ఉండేవాడు. ఇంట్లో కేవలం టీవీ, మొబైల్ ఫోన్ చూస్తూ ఉండే వాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు కుమారుడి శైలిపై పలుమార్లు ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. ఆదివారం గౌరమ్మ పొలం వద్ద చిన్నపని ఉంది.. వెళ్దామని కోరగా అయిష్టంగానే వచ్చి, మళ్లీ ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకుని బాగా చదివించి ప్రయోజకుడిని చేద్దామనుకున్న ఆ తల్లిదండ్రుల కలలు కల్లలైపోయాయి. కొడుకు మృతదేహాన్ని చూసి గుండెలు బాదుకుంటూ రోదించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


చంద్రన్న (ఫైల్)

చిన్నచింతకుంట: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కౌకుంట్ల మండలం ముచ్చింతలలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పెద్ద గొల్ల చంద్రన్న (56) ఇంటి ఎదుట ఉన్న కట్టెలు వర్షానికి తడవకుండా లోనికి తరలిస్తున్నాడు. అదే సమయంలో స్తంభానికి ఉన్న విద్యుత్ తీగ తెగి అతడిపై పడటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చంద్రన్నకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేసుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఏఎస్‌ఐ వెంకటస్వామి వివరించారు.

#### చికిత్స పొందుతూ ఒకరు మృతి

గద్వాల క్రైం: నిద్రమాత్రలు మింగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఎర్రవల్లి మండలం ఆర్.గార్లపాడుకు చెందిన కుర్వ లక్ష్మణ్ (35) పీహెచ్‌డీ పూర్తిచేసి గద్వాలలోని నల్లకుంటకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. ఆరోగ్య సమస్యలు, ఒత్తిడికిలోనై ఈ నెల 13న ఇంట్లో నిద్రమాత్రలు మోతాదుకు మించి వేసుకున్నాడు. అదేరోజు సాయంత్రం వచ్చిన సోదరుడు కుర్వ రామకృష్ణ అపస్మారక స్థితిలో ఉన్న తమ్ముడిని చూసి స్థానికుల సాయంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.




ట్రోఫీతో నారాయణపేట జిల్లా నెట్‌బాల్ బాలుర జట్టు


మిక్స్‌డ్ డబుల్స్‌లో విన్నర్ మహబూబ్‌నగర్

# నెట్‌బాల్‌లో మెరిశారు

జనగామ జిల్లాకేంద్రంలోని బతుకమ్మకుంటలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి 8వ సబ్ జూనియర్ బాలబాలికల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి పాలమూరుకు చెందిన జట్లు సత్తా చాటారు. శనివారం జరిగిన ట్రెడిషనల్, ఫాస్ట్ -5 నెట్‌బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో నారాయణపేట, మేడ్చల్ జిల్లాల హవా కొనసాగింది. ట్రెడిషనల్, ఫాస్ట్-5 నెట్‌బాల్ బాలుర పోటీల్లో నారాయణపేట జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఫాస్ట్ -5 బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ మూడోస్థానం సాధించింది. ఆదివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా చాంపియన్‌గా నిలిచింది. నాగర్‌కర్నూల్ జిల్లా మూడోస్థానం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో 25 జిల్లాలకు చెందిన 620 మంది బాలబాలికలు పాల్గొన్నారు. గెలుపొందిన నారాయణపేట జిల్లా జట్లును నెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్‌గౌడ్, అంజద్అలీ అభినందించారు.

- జనగామ/ధన్వాడ

## క్లుప్తంగా

### విద్యార్థులకు సన్మానం



**వనపర్తి రూరల్:** శ్రీరంగాపురం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కేశపాగ రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాతో సన్మానించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలి

**వనపర్తి రూరల్:** జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 19న సోమవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభలు, సమావేశాలు ఘనంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహానేత అని కొనియాడారు. ఆయన్ను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఈ నేపథ్యంలో వర్ధంతి కార్యక్రమం వైభవంగా నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**పాన్‌గల్:** మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గడ్డం సత్యమ్మకు మంజూరైన రూ.29 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ మహేష్‌నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కును మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషి చేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఖిల్లాఘనపురం:** మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నా చెట్ల తొలగింపులో భాగంగా మండలంలోని మామిడిమాడ, కమాలోద్దీన్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### 20 నుంచి శిక్షణ తరగతులు

**ఖిల్లాఘనపురం:** మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఈ నెల 20వ తేదీ నుంచి 24 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జయశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సోళీపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ఎస్జీటీ ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 9:15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

### రాష్ట్ర కార్యదర్శిగా రాము

**వనపర్తిటౌన్:** హిందూ రాష్ట్ర సభ జాతీయ అధ్యక్షుడు సొపర్నిక విజేంద్ర పురి, రాష్ట్ర అధ్యక్షురాలు నారాయణదాసు జ్యోతిరమణ రాష్ట్ర సెక్రటరీగా బచ్చురామును నియమిస్తూ ఆదివారం నియామకపత్రాన్ని జారీ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు బచ్చు రాముకు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన నాయకులకు రాము కృతజ్ఞతలు తెలియజేశా రు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



**ఆత్మకూర్:** అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎనుమల కుర్మయ్యను ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మండలం కత్తేపల్లి గ్రామానికి చెందిన కుర్మన్నను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాతీయ కోఆర్డినేటర్ వరుణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్‌కుమార్, దాసరి ప్రభు, ఉపాధ్యక్షుడు వినయ్, సంజయ్, నరేష్ పాల్గొన్నారు.

# శిబిరాలతో నైపుణ్యాలు మెరుగు

- ఖిల్లాఘనపురం మండలంలో కొనసాగుతున్న క్రీడా శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



ఖిల్లాఘనపురం మినీ స్టేడియంలో పరుగు తీస్తున్న క్రీడాకారులు

**ఖిల్లాఘనపురం:** గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ శిబిరాలకు పలుగ్రామాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందుతున్నా రు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ శిబిరాల్లో కోచ్‌ల ద్వారా క్రీడల్లో మెలకువలు నేర్చుకొని నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంటున్నారు.

**ఉన్నత పాఠశాలల్లో శిబిరాల ఏర్పాటు**

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు వేసవిలో చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా మండలంలోని ఖిల్లాఘనపురం బాలుర, బాలికల, మామిడిమాడ, మానాజీపేట, సోళీపురం, అప్పారెడ్డిపల్లిలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేశారు. సోళీపురం, అప్పారెడ్డిపల్లి మినహా అన్ని ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. మిగతా రెండు పాఠశాలల్లోనూ రెండు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్, రింగ్‌బాల్, స్కిప్పింగ్, షెటిల్, కబడ్డీ తదితర క్రీడలను నేర్పిస్తున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం ఓ వాలంటీర్‌ను సైతం ఏర్పాటు చేసింది. ఇక ఈ శిక్షణ శిబిరాలను పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.



ఖిల్లాఘనపురం శిబిరంలో వ్యాయామం చేస్తున్న క్రీడాకారులు

**యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో**

గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గాను మండలంలో జిల్లా యువజన, క్రీడల శాఖల ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురంలో వేసవి అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఖిల్లాఘనపురం గ్రామంలోని మినీ స్టేడియంలో అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్ కోచ్‌గా దేవేందర్‌ను నియమించారు. క్రీడాకారులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావలింగ్‌త్రోలలో కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

**ఉచితంగా క్రీడా సామగ్రి**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని జిల్లా యువజన, క్రీడల శాఖ వారు ఉచింతగా అందించినట్లు కోచ్ దేవేందర్ తెలిపారు. మే 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటుగా ప్రశంసాపత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. 8 నుంచి 14 ఏళ్లలోపు క్రీడాకారులు అథ్లెటిక్స్ శిబిరంలో 35 మంది మొత్తం 50 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఉన్నత పాఠశాలల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉచితంగా క్రీడా సామగ్రిని అందించేందుకు గాను ప్రభుత్వం ప్రతి పాఠశాలకు రూ. 25 వేలు కేటాయించినట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు.

### క్రీడాకారులకు మంచి అవకాశం



గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవి క్రీ డా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చే యడం మంచి పరిణామం. క్రీడాకారులకు ఇది మంచి అవకాశం. విద్యార్థులందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించవచ్చు.

– దేవేందర్, అథ్లెటిక్స్ కోచ్

# మాజీ మంత్రి భూ కబ్జాను నిరూపించాం

**వనపర్తి:** 'మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి గద్వాల జిల్లా మానవపాడు మండలం సందూరులో కృష్ణానది భూభాగాన్ని కబ్జా చేశారని అధికారులు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయి. ఆయన చేసిన భూ కబ్జాను మాజీ సీఎం కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమర్థిస్తారా..? లేక చర్యలు తీసుకుంటారా' అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కృష్ణానది తీర ప్రాంతంలో భూమి కొనుగోలు చేసిన మాజీ మంత్రి తన కుటుంబ సభ్యులు, బినామీల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారని.. గద్వాల కలెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, మానవపాడు తహసీల్దార్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి పట్టా భూమితో పాటు సమీపంలోని కృష్ణానది భూ భాగం 2.19 ఎకరాలు ఆక్రమించి కంచె ఏర్పాటు చేసినట్లు నిర్ధారించినట్లు వివరించారు. ఆ భూమిని కబ్జా చెర నుంచి విడిపించారని.. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలోనే తాను స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశానుసారం అధికారులు విచారణ చేసి కబ్జా విషయాన్ని నిగ్గు తేల్చారన్నారు. కృష్ణానది తీరంలోని మారుమునగాల శివారులో సైతం కొంత భూమి కబ్జా చేసినట్లు తెలుస్తోందని.. అధికారిక విచారణ, సర్వే త్వరలో జరగనుందని, అతి త్వరలో ఆసక్తికర నిజాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ఎన్నికల ముందు తాను కబ్జాలకు పాల్పడలేదని నిరూపించాలని సవాల్ విసిరిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**'పాలమూరు'తో ఒక్క ఎకరాకు నీరందలేదు..**

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.27 వేల కోట్లు ఖర్చుచేసి ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 'పాలమూరు' పనులు 90 శాతం పనులు పూర్తిచేశామని చెబుతున్నారని.. మిగిలిన పది శాతం పనులకుగాను రూ. 2,700 కోట్లు తమ ప్రభుత్వం విడుదల చేస్తే పూర్తి చేసి చూపిస్తారా అని సవాల్ విసిరారు. తాను అధికారంలోకి వచ్చిన 16 నెలల వ్యవధిలో నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించానని గుర్తు చేశారు. సమావేశంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్గౌడ్, పీసీసీ సభ్యుడు శంకర్‌ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్ పాల్గొన్నారు.

# అపూర్వ 'సమ్మేళనం'



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**వనపర్తి విద్యావిభాగం:** వనపర్తి పట్టణంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో 1998–99, 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని రోజంతా ఆనందంగా గడిపారు. ఒకప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. రెండు దశాబ్దాలు గడిచిపోయినా తమను గుర్తించుకొని ఆహ్వానించి గౌరవించడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో రవి యాదవ్, సురేష్, శ్రీను, అరుణ జ్యోతి, శోభ , ఉపాధ్యాయులు జగదారెడ్డి మద్దిలేటి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు,

# మడుగులను తలపిస్తున్న రహదారులు



ఖిల్లాఘనపురం - పర్వతాపురం రోడ్డుపై నిలిచిన నీరు



పాత కల్వేటు వద్ద..

**ఖిల్లాఘనపురం:** మండల కేంద్రం నుంచి పర్వతాపురం, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, సల్కెలాపురం గ్రామాలకు వెళ్లే రోడ్డు మడుగును తలపిస్తుంది. మండల కేంద్రం నుంచి పర్వతాపురం వరకు 6 కిలోమీటర్ల రోడ్డు పనులకు గాను ప్రభుత్వం ఆర్అండ్‌బీ నిధులు రూ.2.60 కోట్లతో చేపట్టిన పనులను కాంట్రాక్టర్ కల్వర్టులు నిర్మించి మొర్రం పోసి వదిలేశారు. బిల్లులు రావడం లేదని పనులు మధ్యలోనే నిలిపేశాడు. ఆదివారం మండలంలో కురిసిన వర్షానికి రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించాలని పేర్కొన్నారు.

### రేపు సవారమ్మ ఉత్సవం



**అమరచింత:** పట్టణ శివారులో వెలసిన సవరమ్మ దేవత ఉత్సవాలు ఈనెల 20వ తేదీన మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జాతర నిర్వహించి బోనాలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలి

**గోపాల్‌పేట:** ఎంపీడీఓకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందించినా పరిష్కరించడంలేదని మండలంలోని పాటిగడ్డ తండా వాసులు ఆదివారం ఆందోళన చేశారు. తండాలోని ఓ వార్డులో నీరు రావడం లేదని 20 రోజులు క్రితం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యదర్శులు మిషన్ భగీరథ అధికారులకు తమ గోడు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

### తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు



**ఆత్మకూర్:** మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో మాజీ వార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు సొంత నిధులు రూ.35 వేలు వెచ్చించి తాగునీటి పైప్ లైన్‌ను ఆదివారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### హన్వాడలో తిరంగా ర్యాలీ

**హన్వాడ:** మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. పహల్గాం దాడికి నిరసనగా, ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వద్ల శేఖర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మండల కేంద్రంలో పూర వీధుల గుండా ర్యాలీ చేస్తూ జిల్లా కేంద్రానికి బయలుదేరింది. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొండ లింగన్న, నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, వేణు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, జుక్యనాయక్, చెన్నప్ప, తిర్పతయ్య, కొండలక్ష్మయ్య, చంద్రశేఖర్, చింటు, రాజు, శేఖర్, వివిధ గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# నిధుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి రూరల్:** పెబ్బేరు మండలంలో అభివృద్ధి పనులకు రూ.68 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ఆదివారం పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. పెబ్బేరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీ భవనానికి 20 లక్షలు, యాపర్ల, శాఖాపూర్, వై.కొత్తసూగూరు, తోమాలపల్లి గ్రామాల్లో ఒక్కొక్క అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫైనాన్స్ బాధితులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే మేఘారెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

**గోపాల్‌పేట:** రేవల్లి మండలంలో సాయి ఫైనాన్స్ బాధితులకు అండగా ఉండి వారికి డబ్బులు ఇప్పిస్తానని ఎమ్మెల్యే మేఘారెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని మొత్తం 32 మంది నుంచి సాయి ఫైనాన్స్ నిర్వాహకులు రూ.1.32 కోట్లు తీసుకుని చేతులెత్తేశారు. ఈ క్రమంలో బాధితులంతా ఎమ్మెల్యేతో తమ గోడు వెల్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫైనాన్స్ నిర్వాహకులతో మాట్లాడి ఎవరి డబ్బులు వారికి వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కుర్వ పర్వతాలు, కాళ్ళలక్ష్మయ్య, నూకం బొందయ్య, కుర్వ మల్లేష్, పబ్బతి మల్లేష్, బాలచంద్రయ్య, సాయమ్మ ఉన్నారు.

# సర్కారు బడుల్లో విద్యార్థులకు శిక్షణ



మట్టి బొమ్మల తయారీలో విద్యార్థులు

**పాన్‌గల్:** వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పిల్లలు ఆట, పాటలకు అవధులు ఉండవు. ఐతే సెల్‌ఫోన్‌లు వచ్చిన తర్వాత ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. పిల్లలు సెల్‌ఫోన్‌లో మునిగి తేలుతూ మానసిక కుంగుబాటుతో పాటు కంటి సమస్యలు తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందించేలా చేయడంతో పాటు వ్యక్తిత్వ వికాసం, తెలుగు, గణితం సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చేలా ఉపాధ్యాయులు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆదివారం పాన్‌గల్ ప్రాథ మిక పాఠశాల ఉపాధ్యాయ బృందం, దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం వారి, వారి పాఠశాలల్లో స్వచ్ఛందంగా వేసవి శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీశారు. విద్యార్థుల చేత మట్టితో బొమ్మలు చేయించారు.

# పైపులైన్ మరమ్మతులు చేపట్టాలి



ధ్వంసమైన పైపులైన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

**పాన్‌గల్:** మండలంలోని రేమద్దుల గ్రామంలోని బోర్ నుంచి తాగునీటిని అందించే పైపులైన్ పగిలిపోయి 20 రోజులు అవుతున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్‌కు మరమ్మతు చేసి గ్రామంలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీనిపై ప్రజా సంఘాల నాయకులు భాస్కర్, శ్రీనివాసులు, మల్లేష్, ఎండీ.ఖాజా, రాజేశ్వర్‌రావు పంచాయతీ కార్యదర్శి నందకిశోర్‌ను వివరణ కోరగా రోడ్డు విస్తరణలో భాగంగా పైపులైన్ ధ్వంసమైందని తెలిపారు. రెండు రోజుల్లో కొత్త పైపులు వేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

# గోడు వినేదెవరు..?

- గోపాలమిత్రలకు వేతనాలు అందక ఇబ్బందులు
- తొమ్మిది నెలలుగా ఇదే దుస్థితి
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో మొత్తం 214 మంది గోపాలమిత్రలు



పశువైద్యుడితో కలిసి పశువులకు సేవలందిస్తున్న గోపాలమిత్ర

### బడ్జెట్ రావాల్సి ఉంది

గోపాల్‌మిత్రలకు సంబంధించి 9 నెలల వేతనాలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. బడ్జెట్ విడుదల కాగానే వారి ఖాతాల్లో వేతనాలు జమ చేస్తాం.

– మధుసూదన్‌గౌడ్, జేడీ, మహబూబ్‌నగర్

**మరికల్:** మారుమూల పల్లెలు.. పశువైద్యశాలలు అందుబాటులో లేని పల్లెల్లో పాడి రైతుల ఇంటి ముంగిట్లో అత్యవసర సేవలు అందిస్తూ.. పశువులకు సంబంధించిన సీజనల్ వ్యాధులపై వాటి యజమానులను అప్రమత్తం చేస్తూ.. పశువులకు అత్యవసర చికిత్సలు చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు గోపాలమిత్రలు. ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా మారింది. తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. నిత్యం గ్రామాలను తిరుగుతూ క్షేత్రస్థాయిలో పాడి రైతులకు సేవలందించడంతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ, సామాజిక కార్యక్రమాల్లో సైతం గోపాలమిత్రలు భాగస్వామ్యం అవుతున్నారు. కానీ వీరి గోడు మాత్రం ఎవరూ వినడం లేదు. ఒకటి కాదు.. రెండు కాదు.. తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 214 మంది గోపాలమిత్రలు ఉన్నారు. వీరంతా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా నెట్టుకొస్తున్నారు.

**పశువైద్యంలో కీలకపాత్ర**

వ్యవసాయ అనుబంధంగా పాడి రంగంలో మేలు జాతి ఆవులు, గేదెల పునరుత్పత్తి, పాల ఉత్పత్తి, ఉత్పాదక పెంపు లక్ష్యంగా గోపాలమిత్ర వ్యవస్థ ఏర్పాటైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 2.50 లక్షలకు పైగా పశువులు ఉండగా 214 మంది గోపాలమిత్రలు సేవలు అందిస్తున్నారు. పశువులకు కృతిమ గర్భధారణ చేయడంతోపాటు మేకలు, గొర్రెలకు వీరు ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. అలాగే పశువులకు టీకాలు, నట్టలు, గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడంలో గోపాలమిత్రల పాత్ర కీలకం. ఒక్కొక్కరికి నెలకు గౌరవ వేతనంగా రూ.11,050 చెల్లిస్తున్నారు.

**లక్ష్యాన్ని చేరుకోలేదంటూ..**

పశువుల సంఖ్య మేరకు గోపాలమిత్రలకు కృతిమ గర్భధారణ లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారు. ఒక్కో గోపాలమిత్ర నెలకు 100 పశువులకు కృతిమ గర్భధారణ చేయాలి. కానీ గ్రామీణ ప్రాంతాలు కావడంతో పాడి రైతులు సహజ గర్భధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో వీరు లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇదే కారణం చూపుతూ అధికారులు గోపాలమిత్రల వేతనాల్లో కోతలు విధిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా వచ్చే వేతనాల్లో.. కోత విధించడంతో మేం ఎలా బతికేది అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు నెల నెల వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయంపై పలువురు గోపాలమిత్రలు తమ ఇబ్బందులను మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా వేతనాలు విడుదల చేసేలా చూడాలని కోరుతున్నారు.

# నల్లమలలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**అచ్చంపేట రూరల్:** నల్లమల ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్ కోరారు. ఆదివారం అచ్చంపేటలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నల్లమల ప్రాంత పర్యటనకు వస్తున్న సందర్భంగా శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సీఎం సొంత ప్రాంతం కాబట్టి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉమామహేశ్వర , చెన్నకేశవ రిజర్వాయర్ గురించి హంగామా చేసిన స్థానిక ఎమ్మెల్యే వంశీకష్ణ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. అటవీ ప్రాంతంలో సహజ సిద్ధమైన వృక్ష సంపద ద్వారా పరిశ్రమలు నెలకొల్పితే ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.